

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	27



కిటకిటలాడిన వాడపల్లి



ఆత్రేయపురం, ఏప్రిల్ 13: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.39.10 లక్షలు లభించినట్టు ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జై భీమ్



చిత్రకారుడు

ఆలమూరు, ఏప్రిల్ 13: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాజ్యాంగంలోని 448 ఆర్టికల్స్‌ను ఉపయోగించి తయారు చేసిన అంబేద్కర్ చిత్రపటం విశేషంగా ఆకట్టుకుంది. ఆలమూరు మండలం పెనికేరు గ్రామానికి చెందిన యార్లగడ్డ రాజారావు రాజ్యాంగంలోని 448 ఆర్టికల్స్, 12 షెడ్యూల్స్, 25 విభాగాలు, 128 సవరణలతో అంబేద్కర్ చిత్రపటం రూపొందించారు. ఈ చిత్రపటాన్ని రెండు రోజుల 11గంటల వ్యవధిలో తయారు చేసినట్లు రాజారావు చెప్పారు. రాజారావును పలువురు అభినందించారు.

అంబేద్కర్‌కు 'చిత్ర' నివాళి

రాయవరం, ఏప్రిల్ 13: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి పురస్కరించుకుని రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు ఇండుగమిల్లి సౌధాసాగర్ గీచిన చిత్రపటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంబేద్కర్‌పై ఉన్న అభిమానంతో వివిధ రకాల రంగులతో చిత్రపటాన్ని గీసి అంబేద్కర్‌కు నివాళులు అర్పించనున్నట్లు సౌధాసాగర్ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి కొండేటి..



షర్మిలతో చిట్టిబాబు

వార్త లోపలి పేజీల్లో

ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ, జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. అడ్మిన్ ఎస్పీ ఎస్.షాదర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో రాజోలులో రూ.54,670 నగదును సీజ్ చేసినట్టు శనివారం తెలిపారు. ఎస్ఈబీ ఆధ్వర్యంలో ముమ్మిడివరం, అమలాపురం, ఆలమూరు, రాజోలు, కొత్తపేట పరిధిల్లో నిర్వహించిన విస్తృత దాడుల్లో ఏడుగురిని అరెస్టుచేసి వారి వద్ద నుంచి రెండు ఎన్డీపీ లిక్కరు బాటిళ్లు, 1.5 లీటర్ల ఐఎఎల్, 164 డ్యూటీపెయిడ్ లిక్కరు బాటిళ్లు, 32.34 లీటర్ల ఐఎంఎల్, 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 9 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి 4 ఎన్డీపీ, 1.76 లీటర్ల ఐఎంఎల్, 32 డ్యూటీపెయిడ్ లిక్కరు బాటిళ్లు, 5.76 లీటర్ల ఐఎంఎల్‌ను సీజ్ చేసి రెండు కేసులు నమోదు చేశారన్నారు. చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.



తాళం వేసిన దృశ్యం

వేసిన తాళం వేసినట్టే..

- రూ. కోటితో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అంబేద్కర్ స్టడీ సెంటర్ భవనం
- వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్లక్ష్యంగా వదిలేసిన వైనం
- ఐదేళ్లుగా పెరిగిపోయిన తుప్పలు, సర్పాల సంచారం

రూ.కోటి నిధులతో నిర్మించిన అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవన సముదాయం నిరుపయోగంగా మారింది. ఎస్సీ విద్యార్థులతో పాటు ఎందరికో విజ్ఞానాన్ని అందించాలని.. ఉద్యోగార్థులకు ప్రత్యేక శిక్షణలు ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.కోటి నిధులతో నిర్మించిన అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవనం ఐదున్నరేళ్లుగా నిరుపయోగంగా ఉండిపోయింది.

అమలాపురం రూరల్, ఏప్రిల్ 13: నిర్మించి చాలా కాలం అయినా పాలకులు నేటికీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురాలేకపోయారు. ఇప్పుడు ఆ భవన ప్రాంగణం పాడి పశువులకు విడిదిగా మారిపోయింది. ఏళ్ల తరబడి పట్టించుకునేవారు లేకపోవడంతో విషసర్పాలకు ఆవాసంగా మారింది. ఈ భవనం ఎక్కడో మారుమూలన ఉందనుకుంటే పొరపాటే. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న నల్లమిల్లి గ్రామంలో ఉంది. అప్పటి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కృషితో రూ. కోటి నిధులతో నిర్మించిన ఆ భవనాన్ని 2018 డిసెంబరు 30న అప్పటి ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. అనంతర కాలంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవనాన్ని ఏదో ఒక రోజున వినియోగంలోకి తీసుకువస్తుందని నిరుద్యోగులు, విద్యావంతులు ఆశగా నేటికీ ఎదురుచూస్తునే ఉన్నారు. అక్కడో భవనం ఉందన్న విషయాన్ని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులకు గుర్తుందో లేదో కాని అటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. దీంతో స్టడీ సర్కిల్ ప్రాంగణం మెట్లు సైతం పాడైపోతున్నాయి. ప్రారంభించిన తర్వాత వేసిన తాళం నేటికీ తెరుచుకోని దుస్థితి. గత ఏడాది టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో ఇది మా ప్రగతి.. వినియోగంలోకి తెచ్చేది ఉందా అంటూ అప్పట్లో అధికారులు, పాలకులకు సెల్ఫీ చాలెంజ్ చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. కొత్త సంవత్సరంలో కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వంలోనైనా ఈ భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి నిరుపేద నిరుద్యోగులకు అందుబాటులోకి తీసుకువస్తారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల నిబంధనలకు లోబడి గ్రామసభలు నిర్వహించాలి

-డీపీవో రాంబాబు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 13: ఎన్నికల నిబంధనావళికి లోబడి గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు ఆదేశాలు జారీ చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఏటా ఏప్రిల్ 14న గ్రామ సభలు నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రధానంగా గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, కార్యక్రమాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల యాక్షన్ ప్లాన్, బడ్జెట్ గురించి చర్చించాల్సి ఉందన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోను షెడ్యుల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలన్నారు. గ్రామసభకు హాజరైన సభ్యుల వివరాలతో పాటు సంబంధిత తీర్మానాలు, ఫొటోలను నేషనల్ పంచాయతీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. సర్పంచ్ అధ్యక్షతన జరిగే గ్రామ సభల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఏవిధమైన రాజకీయ అంశాలకు సంబంధించిన ఉపన్యాసాలు ఇవ్వరాదని, కొత్త తీర్మానాలు చేయరాదని, గ్రామ సభ వద్ద రాజకీయ పార్టీలకు సంబంధించిన చిహ్నాలు, జెండాలు ధరించి రాకూడదన్నారు. గ్రామ సభలో కేవలం అధికారులు, ప్రజలు మాత్రమే పాల్గొనాలన్నారు. కొత్త పథకాలు, పనుల గురించి చర్చించరాదని చెప్పారు. రోజువారీ పరిపాలనకు సంబంధించినవి మాత్రమే వివరించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను గ్రామసభలో చర్చించరాదన్నారు. ప్రధానంగా ఈ గ్రామసభ వేదికను ఓటర్లకు అవగాహన కార్యక్రమంగా ఉపయోగించుకుని ఓటింగ్ శాతం పెరగడానికి, నీతివంతమైన ఓటింగ్ జరగడానికి పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీపీవో కోరారు.

వాడపల్లి ఆలయంలో ఎస్ఐ దురుసు ప్రవర్తన


జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు



ఎస్ఐ, ఆలయ సిబ్బంది మధ్య వాగ్వాదం

ఆత్రేయపురం, ఏప్రిల్ 13: సార్వత్రిక ఎన్నికల నియమావళిని బేఖాతరు చేస్తూ ఎస్ఐ శ్రీనివాస్ ఆలయంలో వీరంగం సృష్టించారు. దీంతో ఉప కమిషనర్ భూపతిరాజు కిషోర్‌కుమార్ జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఫిర్యాదులో అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా వెంకన్న ఆలయంలో వీఐపీ దర్శనాలను నిలుపుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రముఖులను తీసుకువెళ్లే గేటుకు తాళం వేసి సీలు వేశారు. శనివారం విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్ వీఐపీ గేటు ద్వారా సీలు తీసివేయించి తాళం తీసి కొంత మంది భక్తులను ఈ గేటు ద్వారా ఆలయంలోకి పంపే ప్రయత్నం చేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ రామానుజం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సూపరింటెండెంట్ రాపాక శ్రీనివాసులకు తెలియజేయడంతో వీఐపీ గేటు వద్దకు వచ్చి ఎస్ఐతో మాట్లాడే ప్రయత్నం చేయగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ పరుష పదజాలంతో తన ప్రతాపాన్ని చూపారు. తన తడాఖా చూపిస్తానంటూ ఆలయ సిబ్బందిపై దుర్భాషలాడారు. ఈ విషయాన్ని ఉప కమిషనర్‌కు సిబ్బంది వివరించారు. దీంతో ఆయన వీఐపీ గేటు వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించారు. పోలీసులు తమ ఇష్టానుసారంగా వారికి కావాల్సిన వ్యక్తులకు దర్శనాలు అందిస్తున్న వైనంపై సీసీ ఫుటేజీ ద్వారా పరిశీలించారు. ఈ మేరకు శనివారం ఉప కమిషనర్ ఎస్ఐ, పోలీస్ సిబ్బంది వ్యవహరించిన తీరుపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.





బీటలు వారిన భూమి

నీరు లేక భూమికి బీటలు

- ఎండుతున్న వరిపొలాలు
- ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు కష్టాలు

అల్లవరం, ఏప్రిల్ 13: ఆరుగాలం శ్రమించి కంటికి రెప్పలా కాపాడుకున్న దాళ్వా వరిచేలు కంకులు చేసే దశలో సాగునీరు రాక రైతులు కష్టాలు ప్రారంభమయ్యాయి. నెల రోజులుగా వరిచేలకు సాగునీరు సరఫరా లేక పలు ప్రాంతాల్లో దాళ్వా చేలు ఎండిపోగా పలు చోట్ల బీటలు తీసి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అల్లవరం మండలంలో దాళ్వా రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరిగేషన్ శాఖాధికారులు పంటకాలువల ద్వారా సాగునీటి సరఫరా చేయక తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు వారాల పాటు పంట కాలువలకు పూర్తిస్థాయిలో నీరు అందిస్తే చేతికి అంది వచ్చిన పంటను దక్కించుకుంటామని రైతులు చెబుతున్నారు. అల్లవరం మండలం యెంట్రుకోన, తాడికోన, గుడాల, కోడూరుపాడు, అల్లవరం తదితర గ్రామాల్లో దాళ్వా రైతులు సాగునీటి సమస్యతో అల్లాడిపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి చివరి దశలో సాగునీరు సరఫరా చేయని దుస్థితి నెలకొందన్నారు. ఎకరానికి దాళ్వా సాగుకు రూ.30 వేల పెట్టుబడి పెట్టామని నెలరోజులుగా సాగునీరు లేక మూడెకరాల పొలం బీటలు తీసిందని యెంట్రుకోనకు చెందిన కౌలురైతు నౌండ్రు వీరవెంకట సత్యనారాయణ ఆవేదన చెందారు. పంట కాలువలో నీటిమట్టం పడిపోయి పంటలు ఎండిపోయాయని అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కలెక్టర్, నీటి పారుదల శాఖాధికారులు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రారంభం కాకుండానే మూతపడింది..!

అమలాపురం రూరల్, ఏప్రిల్ 13: అమూల్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం మేరకు జిల్లా నుంచి పాలను సరఫరా చేసేందుకు నిర్మించిన బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ భవనం ప్రారంభం కాకుండానే మూతబడింది. ఇది ఎక్కడో కాదు నల్లమిల్లిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవనం చెంతనే ఉండడం విశేషం. జగనన్న పాలవెల్లువలో భాగంగా ప్రభుత్వమే జిల్లాలో ఐదు బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్లను ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా అమలాపురం రూరల్ మండలం నల్లమిల్లి, వాడపాలెం, జడ్.మేడపాడు, గోపాలపురం, రాయవరం గ్రామాల్లో 5 వేల లీటర్ల కెపాసిటీతో బీఎంసీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే నల్లమిల్లిలో మిషనరీ బిగింపు పనులు పూర్తయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ భవనం ప్రారంభం కాకుండానే మూతబడింది. ఎన్నికలు పూర్తి అయిన తరువాత గానీ ఆ భవనాల భవితవ్యం ఏమిటో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.



నల్లమిల్లిలో ప్రారంభం కాకుండానే మూతబడ్డ బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్



కాఫర్ డ్యామ్

వైసీపీకి.. మూడింది!

» రంప ఎన్నికల్లో ప్రధానాంశాలుగా పోలవరం, జీవో నెం.3, అల్లూరి జిల్లా » అధికార పక్షానికి ఎక్కడికక్కడ నిరసన సెగలు

» చంద్రబాబు హామీతో కూటమి నేతలకు నీరాజనాలు

(రంపచోడవరం)

రంపచోడవరం రిజర్వుడు అసెంబ్లీ స్థానానికి జరిగే సాధారణ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, స్థానిక గిరిజనులకు నూరుశాతం రిజర్వేషన్ కల్పించిన జీవో నెం.3 రద్దు అంశాలు కీలకంగానూ ప్రతిపక్ష పార్టీలకు అస్త్రాలుగానూ మారుతున్నాయి. ఇక జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటైన అల్లూరిజిల్లా కూడా ఓటర్లను ప్రభావితం చేసే ప్రధాన సమస్యగా మారింది. పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురయ్యే 371 ఆవాసాల్లో 234 ఆవాసాలు రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఉన్నాయి. రంపచోడవరం డివిజన్‌లో దేవీపట్నం మండలం, చింతూరు డివిజన్లోని విలీన మండలాలు చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాలు ఉన్నాయి. ఈ 234 ఆవాసాల్లో సుమారు లక్షమంది జనాభా ఉన్నారు. కాఫర్‌డ్యామ్ నిర్మాణంతో ఇందులో ఒక్క దేవీపట్నం మండలంలోని 38 ఆవాసాల్లో ఒక్క తాళ్లూరు మినహా అన్ని ఆవాసాలనూ ఖాళీ చేయించేశారు. విలీన మండలాల్లోని సుమారు 194 ఆవాసాలకు సంబంధించి ఎక్కడా పునరావాస ప్రగతి లేదు. తరలించిన 37 ఆవాసాల నిర్వాసితులకు ఎక్కడా పూర్తిస్థాయి పునరావాసాన్ని కల్పించలేదు.

జీవో నెం.3 ఈ ఎన్నికల్లో కీలకం

ఇక గిరిజన ప్రాంతాలలో స్థానిక గిరిజనులకే నూరు శాతం ఉపాధ్యాయ పోస్టులను కల్పించే తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన జీవోనెం. 3 కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. సుప్రీం కోర్టు ఈ జీవోను కొట్టివేయడంతో జనాభా ప్రాతిపదికన మాత్రమే ఉద్యోగాలు స్థానిక గిరిజనులకు దక్కుతాయి. దీంతో గిరిజన వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ విషయంలో ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్లు దాఖలు చేయగా మరో 15 రివ్యూ పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. ఈ నెలలోనే ఈ కేసుల విచారణ కూడా సుప్రీంలో జరిగింది. ఈ కేసుల మాట ఎటుంచినా అరకు సభలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఈ జీవో నెం.3పై స్పందించి తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే స్థానిక గిరిజనులకు గిరిజన ప్రాంత ఉద్యోగాల్లో నూరుశాతం రిజర్వేషను దక్కే చర్యలను తీసుకుంటామని హామీ ఇచ్చారు. వైసీపీ నేతలు, ప్రభుత్వం మాత్రం ఇంతవరకూ ఈ అంశంపై స్పందించకపోవడం శోచనీయం.

ఈ పోలవరం నిర్వాతుల అంశం, జీవో నెం.3 వ్యవహారం అధికార పార్టీ నేతలను ఇరుకున పెట్టే అంశంగా మారింది. ఎక్కడికక్కడ ఆయా నేతలకు నిరసన సెగలు తగులుతూనే ఉన్నాయి. ఇక అల్లూరి జిల్లా ఏర్పాటు అంశం కూడా ఈ నియోజకవర్గ ప్రజానీకాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈ సమస్యను తీర్చే విధంగా రంపచోడవరం, పోలవరం గిరిజన నియోజకవర్గాలను కలుపుతూ పోలవరం గిరిజన జిల్లా ఏర్పాటుపై ఇప్పటికే దేశం అధినేత హామీ ఇచ్చారు. చంద్రబాబు హామీతో ఇక్కడ కూటమి అభ్యర్థులకు నీరాజనాలు పడుతున్నారు. మొత్తంగా పోలవరం నిర్వాసితులు, జీవో నెం.3 అల్లూరి జిల్లా అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావాన్ని చూపబోతున్నాయి.

పోలవరం గిరిజన జిల్లా ఏర్పాటుపై దేశం అధినేత హామీ

కొన్ని ఆవాసాల నిర్వాసితులకు పునరావాస కాలనీలను కూడా పూర్తి చేయలేదు. ఈ అంశం ప్రధాన పార్టీల రెండింటి మధ్య నలుగుతున్న అంశం. ఈ అంశాన్నే వామపక్ష-కాంగ్రెస్ కూటమి కూడా అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోంది.



అనివేటి మండపానికి చేరిన నూతన ధ్వజస్తంభం

సత్యదేవుడి చెంతకు చేరిన

నూతన ధ్వజస్తంభం

18 నుంచి పూజలు, 22న ప్రతిష్ఠా కార్యక్రమం

అన్నవరం, ఏప్రిల్ 13: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి త్వరలో ప్రతిష్ఠించనున్న నూతన ధ్వజస్తంభం శనివారం ఇంజనీరింగ్ అధికారులు అనివేటి మండపంనకు ప్రత్యేక క్రేన్ ద్వారా తీసుకుని వచ్చారు. 56 అడుగులు ఉన్న నారవేప కర్రను ధ్వజస్తంభ ప్రతిష్ఠకు వినియోగిస్తున్నారు. ఈవో రామచంద్రమోహన్ దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు. ఈనెల 18 నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించి 22న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నారు. అనంతరం ధ్వజస్తంభంకు రాగిరేకు అమర్చి బంగారుపూతను వేయనున్నారు. సుమారు రూ.4కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా వేస్తున్నారు. దీనికయ్యే వ్యయమంతా నెల్లూరుకు చెందిన దాత కుటుంబసభ్యులు విరాళంగా అందజేస్తున్నారు. ఈ పనులను డీఈలు ఉదయ్‌కుమార్, బి.ఎస్.రాంబాబుల సూచనలతో సిబ్బంది వేగవంతం చేస్తున్నారు. 22వ తేదీన జాతీయ రహదారిపై నిర్మిస్తున్న నమూనాలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించే పనులను అధికారులు శరవేగంగా చేపడుతున్నారు. దేవదాయ కమిషనర్ సత్యనారాయణ చేతులమీదుగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ట్రైన్‌లో ఆడ బిడ్డకు జన్మనిచ్చిన తల్లి



తల్లీబిడ్డలను 108లో ఎక్కిస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, ఏప్రిల్ 13: గౌహతి ఎక్స్‌ప్రెస్ బెంగుళూరు నుంచి కృష్ణాగంజ్ వెళుతున్న రైలులో బెంగుళూరుకు చెందిన హీనా పురిటినొప్పులతో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో రైలు తుని వద్దకు చేరుకోవడంతో ప్రయాణికుల సహాయంతో రైల్వే పోలీసులకు, 108 సిబ్బందికి సమాచారం అందించగా తల్లీ బిడ్డలను 108లోఎక్కించి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



ఉప్పాడ తీరంలో లంగర్‌వేసి భద్రపరుచుకొన్న బోట్లు

రేపటి నుంచి జూన్ 14 వరకు

సముద్రంపై వేట నిషేధం

61 రోజుల పాటు మత్స్యకారుల ఉపాధికి విరామం

ఉప్పాడ(కొత్తపల్లి), ఏప్రిల్ 13: సముద్రంలో మత్స్యసంపద పునరుత్పత్తి చెందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం ఈనెల 15 నుంచి జూన్ 14వరకు వేట నిషేదం అమలు చేస్తోంది. దీనిలో భాగంగా సుమారు 61రోజులపాటు తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేట చేసేందుకు వీలులేదు. కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందిన సుమారు 1400 బోట్లపై వేట చేసే మత్స్యకారులకు సుమారు 8,400 మంది మత్స్యకారులకు రెండునెలల పాటు జీవనోపాధికి ఆటంకం కలుగనుంది. ప్రతీ సంవత్సరం వేట నిషేధం అమలు చేయడం వలన పెద్దజాతి చేపలైన వంజరం, కోనాము, మాగ, మునివాలం, సందువా, సుదుములు, సొర్ర, రొయ్య, నెత్తళ్ల వంటి చేపలు గుడ్లు పెట్టి పొదిగి మత్స్యసంపద అభివృద్ధి చెందు తుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

వేట పరిహారం వెంటనే చెల్లించాలి

వేట నిషేధ కాలంలో ప్రభుత్వం మత్స్యకారులకు చెల్లించే పరిహారం వెంటనే చెల్లించాలని తీరప్రాంత మత్స్యకారులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సరైన పాటు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని మత్స్యకారులు వాపోతు న్నారు. వేట నిషేధ పరిహారం సకాలంలో చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన

శృంగార వల్లభస్వామి ఆలయం



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభస్వామి

పెద్దాపురం, ఏప్రిల్ 13: కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,51,580 అన్నదాన విరాళాలు రూ.62,310 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.8,240 తులాభారం రూ.450 కానుకద్వారా 216 వెరసి రూ.3,27,796 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపాయి.. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

19న అచ్చంపేటలో

సీఎం జగన్ బస్సు యాత్ర

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 13: కాకినాడరూరల్ మండలం అచ్చంపేట సెంటర్లో ఈనెల 19న సీఎం జగన్ నిర్వహించే మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతానికి సమిష్టిగా కృషి చేయాలని వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ పి.మిథున్‌రెడ్డి కోరారు. శనివారం కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వైద్యనగర్‌లో రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాకు చెందిన 7 నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, అసెంబ్లీ అభ్యర్థులు, ముఖ్య నాయకులతో బస్సుయాత్రపై సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో కాకినాడరూరల్ తిమ్మాపురం సెంటర్‌లో సిద్ధం సభ ద్వారా సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరిస్తారన్నారు. పార్టీ కేడర్ ఈ బస్సుయాత్రను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కోరారు. వందశాతం ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత సీఎందన్నారు. రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాలో పిఠాపురం ఒకటని, పవన్ కోసం ప్రత్యేకంగా ఎన్నికల ప్రచారం, ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం తమ పార్టీకి లేదన్నారు. సమావేశంలో ఎంపీ వంగా గీత, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పెండెం దొరబాబు, ఎమ్మెల్యే అభ్యర్థులు దవులూరి దొరబాబు, వరుపుల సుబ్బారావు, తోట నరసింహరావు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పి.అమ్మాజీ, సివిల్ సప్లయిస్ స్టేట్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

సబ్బు బిళ్లపై అంబేడ్కర్ చిత్రం



సోప్ కార్వింగ్ ద్వారా సబ్బు బిళ్లపై చెక్కిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రం ← → ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు



గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 13: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రాన్ని సబ్బు బిళ్లపై చెక్కారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. సోప్ కార్వింగ్ కళ ద్వారా మూడు గంటలపాటు శ్రమించి చెక్కిన అంబేద్కర్ చిత్రాన్ని గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు తిలకించారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర గురించి అవగాహన కల్పించారు. గోవిందరాజులను విద్యాశాఖ ఆర్‌జేడీ గోవిందరాజులు, డీఈవో పి.రమేష్, డీవైఈవో డేనియల్‌రాజు, ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్‌ఎం సురేష్‌కుమార్ అభినందించారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోతే..

ఓటు దుర్వినియోగం కాకుండా నోటా

అమలాపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు నచ్చకపోతే ఓటు దుర్వినియోగం కాకుండా నోటాకు ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో పోటీలో ఉన్న అభ్యర్థుల గుర్తులతో పాటు నోటా ఆప్షన్‌ను ఏర్పాటు చేసింది. నోటా బటన్ నొక్కితే ఓటు ఏ పార్టీకి పడదు. కానీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకున్నట్టుగానే ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంటుంది. సాధారణంగా ఎన్నికల సమయంలోనే నోటా అనే పదం ఎక్కువగా వినిపిస్తుంది. గడిచిన సార్వత్రిక ఎన్నికల నుంచి నోటాకు ఆదరణ పెరుగుతూ వస్తోంది. వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులు నచ్చకపోతే చాలా మంది ఓటు వేయకుండా మిగిలిపోతున్నారు. అలాంటివారు సైతం ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు తమ నిరసనను తెలియచేసేందుకు నోటా ఎంతో ఉపయోగపడుతుంది. ప్రధానంగా పోలింగ్ శాతాన్ని పెంచడంతో పాటు ఓటర్లు తమ అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే అవకాశం కల్పించేందుకు నోటాను తీసుకువచ్చారు. బరిలో నిలబడ్డ కొందరు అభ్యర్థులకంటే నోటాకు పడ్డ ఓట్లు ఎక్కువగా ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇంటి వద్ద నుంచే ఓటింగ్‌కు దరఖాస్తు..

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన తరువాత ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకోవాలి. ఫారం-12డిని పూర్తిచేసి సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. 85ఏళ్ల పైబడినవారు, 40 శాతం దివ్యాంగత్వం ఉన్నవారు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు అర్హులుగా నిర్ధారించారు. ఇంటి వద్దే ఓటు వేసే ప్రక్రియ మొత్తాన్ని వీడియో చిత్రీకరణ చేస్తారు. ఓటు ఎవరికి వేసారో తెలియకుండా గోప్యతను పాటించేలా రహస్య ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తారు. అవసరమైతే అభ్యర్థులు ఈ ప్రక్రియను పర్యవేక్షించుకోవచ్చు.

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన దొరబాబు

శంఖవరం, ఏప్రిల్ 13: కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దొరబాబు టిప్పర్‌లారీ ఢీకొని మృతి చెందాడు. శంఖవరం నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న దొరబాబు(35)ను కత్తిపూడి నుంచి రౌతులపూడి వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మృతి చెందాడు. స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించినా తలకు, కాళ్ళకు బలమైన గాయాలు తగలడంతో మార్గంమధ్యలోనే దొరబాబు మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై అన్నవరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు నమోదుకు ఆఖరి అవకాశం



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిది. శాసన కర్తలను, నేతలను ఎన్నుకునేందుకు వయోజనులందరికీ రాజ్యాంగం కల్పించిన గొప్ప అవకాశం ఓటు. అర్హత ఉన్నా ఓటు హక్కు లేని వారికి, 18 ఏళ్ళు నిండినవారు కొత్తగా ఓటు వేసేందుకు చాలామంది ఆశక్తి చూపడంలేదు. పల్లెలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం మరింత తక్కువ నమోదవుతుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన ఓటు హక్కును పొందడంతోపాటు ఎన్నికలలో ఓటు హక్కుపై ప్రజలకు వివరిస్తున్నారు. వినూత్న కార్యక్రమాలతో ఓటు హక్కు ప్రాముఖ్యతపై తెలియజేస్తున్నారు. రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేలా అధికారులు, యంత్రాంగం కృషిచేస్తున్నారు. ఇందులో భాగంగా ఓటరు నమోదు, ఓటు హక్కువినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

» రేపటితో ముగియనున్న గడువు
» ఓటు హక్కు నమోదు, వినియోగంపై విస్తృత ప్రచారం
» ఓటింగ్ శాతం పెంచేందుకు వినూత్న కార్యక్రమాలు
» పట్టణాలు, నగరాలు, యువతే టార్గెట్
» కాలనీలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

సామర్లకోట, ఏప్రిల్ 13: కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు సమీపిస్తోంది. 18 ఏళ్ల నిండిన వారితో పాటూ అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాల వలన ఓటరుగా పేరు నమోదు చేసుకోని వారు ఇక ఆలస్యం ఎంతమాత్రం చేయకుండా తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఈ నెల 15వ తేదీలోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటేనే ఈ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటేసే అవకాశం లభిస్తుంది. ఈ మే నెల 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న విషయం విదితమే. అర్హత ఉన్న వారంతా ఓటరుగా పేరు నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం చేస్తోంది. అయితే పట్టణాలు, నగర ప్రాంతాలలో చదువుకున్నవారు అధికంగానే ఉన్నప్పటికీ ఓటరుగా పేరు నమోదు, ఓటుహక్కు వినియోగం విషయంలో ప్రజలు ఆశక్తిచూపడంలేదు. గ్రామీణులతో పోలిస్తే పట్టణాలు, నగరాలలో ఓటింగ్ ప్రక్రియల్లో పాల్గొంటున్న వారి సంఖ్య తక్కువే ఉంటోంది. ఇది ప్రతీ ఎన్నికలలోనూ నిరూపితం అవుతుంది. ఓటు విలువ తెలియక తమ పాలకులను ఎన్నుకునే అవకాశాన్ని కోల్పోతున్నారు. ముఖ్యంగా నగర, పట్టణాలు, తదితర శివారు ప్రాంతాలలో వలస కూలీలు, సంచార జీవులు లక్షలాది మంది ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారు. కొందరు తమకు అర్హత ఉన్నా ఓటరుగా పేరు కూడా నమోదు చేసుకోవడం లేదు. పట్టణ, నగర ప్రాంతాలు అభివృద్ధితో ముందుకు వెళుతున్నా ఎన్నికలలో ఓటు వేసే విషయంలో మాత్రం వెనుకబడే ఉంటున్నారు. ఎన్నికల రోజును చాలా మంది ఓ సెలవు దినంగానే చూస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో కొన్ని పట్టణ ప్రాంతాలు సైతం ఓటింగ్ శాతం 60 శాతానికి మించకపోవడం గమనార్హం. వీటిని దృష్టిలో ఉంచుకుని రానున్న ఎన్నికలలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు రెండు నెలల ముందుగానే ఎన్నికల కమీషన్ అధికారులు కార్యాచరణ మొదలెట్టారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజలను చైతన్యపరిచేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇప్పటికే బూత్‌స్థాయి అధికారులు (బీఎల్వో)తో పాటూ తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాలలో ఓటరు జాబితాను అందుబాటులో ఉంచారు. ప్రజలు ఈ జాబితాలను పరిశీలించి జాబితాలో తమపేరు ఉందో లేదో చూసుకోవాలి. మున్సిపాల్టీలలో మున్సిపల్ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఎన్నికల సంఘం ఓటరు సర్వీస్ పోర్టల్‌తో పాటు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు చివరి గడువు మాత్రం ఏప్రిల్ 15 అని మాత్రం అందరూ గుర్తించాలి.

ఓటు హక్కు పొందేందుకు వీరంతా అర్హులే

జిల్లా వ్యాప్తంగా పలు మండలాలలో 18 ఏళ్ల నిండిన వారంతా ఓటరుగా తమ పేరు నమోదు చేసుకునేందుకు అర్హులే. 2006 మార్చి 31లోగా పుట్టిన వారంతా ఓటరు జాబితాలో పేరు నమోదుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుకు వయస్సు ధ్రువపత్రంతోపాటు పాస్‌పోర్టు సైజ్ ఫోటో జతపరిచి సంబంధిత బీఎల్వోలకు అందజేయాలి. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు, అన్ని అర్హతలున్నా ఇప్పటివరకూ ఓటరుగా నమోదు చేసుకోని వారంతా ఫారం-6 ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. ఓటరు నమోదుకు వెబ్‌సైట్ ద్వారా కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు అన్నీ ఓకే అయిన తరువాత కొన్ని రోజులలో ఇళ్ల వద్దకే ఓటరు గుర్తింపు కార్డును పంపిస్తారు. సంబంధిత ప్రాంత బూత్‌లెవెల్ అధికారులు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తారు. ఒకవేళ గుర్తింపు కార్డు రాకున్నా ఆన్‌లైన్ నుంచి డౌన్లోడ్ చేసుకోవచ్చు. ప్రజలు దరఖాస్తులు చేసుకునే సమయంలో దరఖాస్తు రిజెక్ట్ కాకుండా నిర్ణీత ప్రొఫార్మాలో ఆధార పత్రాలతో జతపర్చి దరఖాస్తు చేసుకోవాలి. ముఖ్యంగా జెరాక్స్ పత్రాలను జతచేయాలి. ఇటీవల తీసుకున్న పాస్‌పోర్టు సైజ్ ఫోటోను ప్రొఫార్మాలో అడిగిన ఇతర వివరాలను సమర్పిస్తే దరఖాస్తు రిజెక్ట్ కాకుండా ఓటరుగా నమోదవుతారు.

యువతే లక్ష్యంగా వివిధ అవగాహన కార్యక్రమాలు

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంచేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. 18 ఏళ్ల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. దేశంలోని ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలనే సంకల్పంతో కేంద్ర ఎన్నికల కమీషన్ స్వీప్(సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి జిల్లాలో స్వీప్ కార్యక్రమ నిర్వహణ కోసం ఒక నోడల్ అధికారిని నియమించారు. ముఖ్యంగా ఓటింగ్ శాతం తక్కువ నమో దయ్యే పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాలలో వినూత్న రీతిలో ఓటర్ల చైతన్యకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతను చైతన్యపరిచేందుకు కళాశాలల్లో కూడా వినూత్న అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులకు ఓటు నమోదుతోపాటూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన ఏర్పరుస్తున్నారు. ప్రతీ కళాశాలలో క్యాంపస్ అంబాసిడర్‌లను నియమించారు. వీరు మిగతా విద్యార్థులకు ఓటరుగా నమోదుకావడానికి తోడ్పడుతున్నారు. ఓటు హక్కు వినియోగంపై తల్లిదండ్రులను చైతన్యపరిచే పిల్లలతో కూడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేను ఓటేస్తా, 5కె రన్, 2కె రన్, ప్రతిజ్ఞలు వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అధికారులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజెన్‌లు, ట్రాన్స్‌జెండర్లు, యువత, దివ్యాంగులు, వాకర్స్ అసోసియేషన్, సైకిలిస్ట్ అసోసియేషన్లు, పోలీసులు, విద్యార్థులను ఈ కార్యక్రమాలలో భాగస్వాములుగా చేస్తున్నారు. రెండు రోజులుగా రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఎంకే మీనా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఐ ఓట్ ఫర్ ష్యూర్ (నేను తప్పకుండా ఓటు వేస్తాను) వంటి నినాదాలతో ప్లకార్డులను ప్రదర్శించారు.

25న అనుబంధ జాబితా

లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను గత ఫిబ్రవరి 8న ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో మరోసారి జాబితా సవరణ చేపట్టారు. దీని ప్రకారం ఈనెల 15 తేదీ వరకూ ఓటరు నమోదు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న వారి పేర్లను అనుబంధ జాబితాలో చేరుస్తారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓటు వేయాలన్నా, అభ్యర్థులుగా పోటీ చేయాలన్నా ఓటరు జాబితాలో పేరుంటేనే సాధ్యం అవుతుంది. ఓటు హక్కు అర్హత ఉండి జాబితాలో పేరులేని వారందరూ దరఖాస్తు చేసుకోవాలి. అలాగే రాజకీయ పార్టీల నాయకులు, చదువుకున్న వారు ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణలపై తెలియని వారికి తెలియజెప్పాలి. ఓటరు జాబితాలో పేరు చెక్ చేసుకోవాలని, పేరు లేకుంటే దరఖాస్తు కోసం ప్రోత్సహించాలి.

- కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు
- టీడీపీలో శెట్టిబలిజ సంఘ నాయకులు చేరిక
- ఎ.వేమవరంలో ఎన్నికల ప్రచారం

ఘనంగా షిరిడీ సాయి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

ద్రాక్షారామ, ఏప్రిల్13: ద్రాక్షారామ సూర్యవీధిలో వేంచేసియున్న భీమషిరిడీ సాయినాధుని 28వవార్షికోత్సవ పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం కాకడహారతి, పాలాభిషేకం, పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. 3గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఆలయధర్మకర్త సత్తి సుబ్బారెడ్డి, అధ్యక్షులు పోతంశెట్టి రాంబాబు, కార్యదర్శి కొమ్మిశెట్టి బాబు, కమిటీ సభ్యులు పాపాజీ, మేకా కుమార్, పేరూరి వీర్రాజు, ఆళ్ల భీమశంకరం పాల్గొన్నారు.

బాలబాలాజీ స్వామికి విశేష పూజలు




మామిడికుదురు: బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు, కొత్తపేట: శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మామిడికుదురు, ఏప్రిల్ 13: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానంలో నిర్వహించిన లక్ష్మీనారాయణ హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శనివారం స్వామివారిని 3164మంది దర్శించుకుని, 2380 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.2,26,406 ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

శనిత్రయోదశికి పోటెత్తిన భక్తులు
స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.1.61లక్షలు

కొత్తపేట, ఏప్రిల్13: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలకు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,61,191 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయకమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

యానాంలో పుదుచ్చేరి డీజీపీ పర్యటన



స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను పరిశీలిస్తున్న డీజీపీ శ్రీనివాస్

యానాం, ఏప్రిల్13: పుదుచ్చేరి పోలీస్ ఉన్నతాధికారి డీజీపీ బి.శ్రీనివాస్ శనివారం యానాం పర్యటనకు వచ్చారు. పుదుచ్చేరి నుంచి రాజమండ్రి వచ్చిన ఆయన రోడ్డు మార్గంలో యానాం చేరుకున్నారు. యానాం ప్రభుత్వ అతిథి గృహం వద్ద పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్పీ రాజశేఖర్, సీఐ షణ్ముగం, ఎస్ఐలు తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన పోలీసులు నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం స్థానిక పోలీస్‌శాఖ కార్యాలయంలో డీజీపీ పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. యానాంలో పోలీస్‌శాఖ పనితీరు, వివిధ అంశా లపై చర్చించారు. యానాం ముఖద్వారం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను, స్ట్రాంగ్‌రూమ్స్ వద్ద పోలీస్ భద్రతను పరిశీలించారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి




కొత్తపేట:శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ, పి.గన్నవరం:శిక్షణలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీరామచంద్రమూర్తి

కొత్తపేట, ఏప్రిల్ 13: ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించేందుకు పీవో, ఏపీవోలు కృషి చేయాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ సూచించారు. శనివారం కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల విధులకు హాజరయ్యే 584 మంది పీవో, ఏపీవోలకు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఈవీఎంల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీవో, ఆర్వో సత్యనారాయణ శిక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఓపీవోలకు సంబంధించి 15న శిక్షణ ఇస్తారని ఆర్డీవో తెలిపారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 13: పట్టణంలో రత్నంపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. రామచంద్రపురం, కె.గంగవరం మండల పరిధిలో పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. శిక్షణా తరగతుల్లో ఆర్డీవో ఎస్.సుధాసాగర్, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు తహసీల్దార్లు, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

పి.గన్నవరం, ఏప్రిల్ 13: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ విధిగా పాటించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. పి.గన్న వరం హైస్కూల్లో పీవో, ఏపీవో, ఓపీవోలకు జరిగిన శిక్షణా తరగతులను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. పోలింగ్ బూత్ వద్ద పాటించాల్సిన నియమావళిని పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 212 బూత్‌లకు 254మంది పీవోలు, 254మంది ఏపీవోలు, 1003మంది ఓపీవోలకు 2రోజులు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం శిక్షణా తరగతులను ఆయన పరిశీలించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎస్‌కె హసాన్సేన్, తహశీల్దార్లు జె.విమలకుమారి, డీఎల్ ప్రేమద్వార, ఎం.మెరికమ్మ, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, డిప్యూటీ తహశీల్దార్ డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నారై రాయుడుకు ఉగాది పురస్కారం

అలమూరు, ఏప్రిల్ 13: చెముడులంకకు చెందిన ఎన్నారై రాయుడు వెంకటేశ్వరరావుకు ఉగాది నంది పురస్కారం లభించింది. రాజమహేంద్రవరం ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్వర్యంలో ఈపురస్కారాల ప్రదానం జరిగింది. వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాయుడు వెంకటేశ్వరరావు సేవలను గుర్తించి నంది పురస్కారం అవార్డుకు ఎంపిక చేశారు. ఈఅవార్డును ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మీరెడ్డి, శ్రీశ్రీ అకాడమీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, భారతి, అద్దంకి రాజా నుంచి వెంకటేశ్వరరావు అందుకున్నారు.



భవిష్యత్‌ను దెబ్బతీసిన జగన్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలి





అమలాపురం: శెట్టిబలిజ నాయకులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఆనందరావు, కె.గంగవరం:శివలలో పార్టీలో చేరిన నాయకులతో సుభాష్, ఐ.పోలవరం: కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దాట్ల బుచ్చిబాబు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 13: రాష్ట్ర భవిష్యత్తును దెబ్బతీసిన జగన్ ప్రభుత్వానికి ఓటుతో గుణపాఠం చెప్పాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేక అల్లాడిపోతున్నారని ఆటువంటి వారి భవిష్యత్తు కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా శనివారం ఎ.వేమవరం గ్రామంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, తెలుగు మహిళ జిల్లాశాఖ అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి అధికారి జయవెంకటలక్ష్మిలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించడం ద్వారా రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని వివరిస్తూ ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన శెట్టిబలిజ సంఘ నాయకులు బొక్కా జగదీష్, కేతా శ్రీనివాస్, దూనబోయిన భూషణం, కొప్పిశెట్టి సురేష్, కుడుపూడి మురళీకృష్ణ తదితరులు టీడీపీలో చేరగా వారికికండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గానారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రావూరి భాస్కరరావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మల్లుల పోలయ్య, జనసేన మండల శాఖ అధ్యక్షుడు లింగోలు పండు, దానం గోపి, లింగోలు నెహ్రూ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మంద గద్దయ్య, కంచిపల్లి అబ్బులు, నడింపల్లి ఉదయబాబు, బడుగు సత్యనారాయణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ ఉపసర్పంచ్

కె.గంగవరం, ఏప్రిల్ 13: వైసీపీకి భారీ షాక్ తగిలింది. కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ శనివారం శివలలో ఉపసర్పంచ్ నిడదవోలు సుజాత సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లి టీడీపీలో చేరాలని కోరారు. పార్టీలో చేరిన ఆయనకు సుభాష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు గ్రామంలోని పలుసామాజిక వర్గాలకు చెందిన ర్యాలి ప్రసాద్, వాసంశెట్టి మసేను, ఇళ్ల రవికుమార్, పిల్లి సత్యకృష్ణ, చీకట్ల వెంకటరత్నం, మోర్త ప్రకాశరావు, ముమ్మిడి వరపు అర్జున్, మోర్తా శ్రీనివాసు, పోలినాటి కృష్ణ, ఇనకోటి గణేష్, సన్నపులోవరాజు తదితర 50మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారందరికి సుభాష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శివల, గుడిగళ్ళభాగ గ్రామాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. పార్టీ నాయకులు చంద్రు వివిఎస్ఎస్ చౌదరి, రేవు శ్రీను, బలుసు శివప్రసాద్, మరివాడ చిన్నికృష్ణ, గన్ని శ్రీనివాసు, నేమాని అబ్బు, శీరెడ్డి సత్తిబాబు, కొత్తపల్లి మొర్తీ, మరివాడ సూరిబాబు, వాసంశెట్టి కృష్ణ, బీజేపీ నాయకులు అవసరాల రమణమూర్తి, కవులూరి కృష్ణ, గుర్రాల సత్యనారాయణ, జనసేన నాయకులు దేవరపల్లి చక్రి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు న్యాయం

ముమ్మిడివరం, ఏప్రిల్ 13: చంద్రబాబుతోనే రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని టీడీపీ నాయకుడు కురశాల శివబాబు పేర్కొన్నారు. అనాతవరం గొల్లగూడెంలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. సూపర్-6 బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ పథకాల బ్రోచర్లను ఇంటింటికీ తిరిగి అందించారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కూటమి అభ్యర్థులు దాట్ల బుచ్చిబాబు, ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వలవల శ్రీను, పేరిచర్ల సురేష్‌రాజు, శీలం వెంకటేశ్వరరావు, అందే శ్రీను, కుంచే శ్రీను, యల్లమిల్లి శ్రీను పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో బలహీనవర్గాలకు అన్యాయం

రాజోలు, ఏప్రిల్ 13: వైసీపీ ప్రభుత్వ హయాంలో బలహీనవర్గాలకు తీవ్రంగా అన్యాయం జరిగిందని రాజోలు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ అన్నారు. పాలగుమ్మిలో ఎన్నికల ప్రచారంలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బలహీనవర్గాల భవిష్యత్తు కూటమితోనే సాధ్యమన్నారు. బీసీ డిక్లరేషన్ ఒక అద్భుతమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా శ్రీను, సర్పంచ్ కడలి సత్యనారాయణ, కడలి పెద్ద, అప్పారి మురళీకృష్ణ, చాగంటి స్వామి, నరుకుల కృష్ణ, దిరిశాల బాలాజీ, చుట్టుగుళ్ల సత్యనారాయణ, మోకా పార్వతి, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

నియోజకవర్గంలో జగన్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి

పి.గన్నవరం, ఏప్రిల్ 13: నియోజకవర్గంలో సీఎం జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ప్రశ్నించారు. గంటిపెదపూడి, ఉడిమూడి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జనసేన జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, వైస్ ఎంపీపీ చెలిబోయిన గంగాదేవి, సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, సంసాని పెద్దిరాజు, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, ముచ్చర్ల సాయిసత్యనారాయణ, నేలపూడి దామోదరం, యర్రంశెట్టి సాయిబాబు, శేరు శ్రీనుబాబు, రాణీ శ్రీనివాసశర్మ, కె.సత్యనారాయణరాజు, అడ్డాల వెంకటేశ్వరావు, యల్లమిల్లి అగ్గిరాముడు, అడ్డగళ్ల సిరిజ్యోతి, ఏసమ్మ, మట్టా మసేనురావు, తెగడ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

ఐ.పోలవరం, ఏప్రిల్ 13: ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు శనివారం జి.మూలపొలంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించేందుకు అందరూ అంకితభావంతో పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కాకర్లపూడి రాజేష్, లంకలపల్లి బుల్లియ్య, దండుప్రోలు సాయి, సంగాని వీరబాబు, లంకే శ్రీనివాస్, దాట్ల పృధ్వీరాజు, ఉద్దిశ బుజ్జి, గంగుల శేషారావు, తోటకూర సూరపరాజు, ఓలేటి వెంకట్రావు, లోవరాజు, మెల్లం సత్యనారాయణ, ఉంగ్రు గంగాధర్, ముదునూరి ధనరామవరాజు, కామాడి సాయి, పెంటా రవి, ముంగి కృష్ణ, చిక్కాల శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామని తీర్మానం



అయినవిల్లిలో బీసీ సదస్సులో పాల్గొన్న నాయకులు

అయినవిల్లి, ఏప్రిల్ 13: బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తామని ప్రకటించడం ఎంతో శుభపరిణామమని బీసీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ మండలశాఖ ప్రధాన కార్యదర్శి కుడుపూడి బుజ్జి ఆధ్వర్యంలో అయినవిల్లిలో టీడీపీ మండల బీసీ నాయకుల సమావేశం శనివారం జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణలను గెలిపించుకుంటామని ఏకవాక్య తీర్మానం చేశారు. నాయకులు మట్టపర్తి నాగేశ్వరరావు, మిద్దే పట్టాభి, గుత్తుల భాస్కరరావు, కముజు విజయభాస్కరరావు, దంగేటి వెంకటరమణ, పెండ్ర రమేష్, వెలిగట్ల సాయిబాబు, కుడుపూడి కొండయ్య, రాయుడు సత్యనారాయణ, ముషిణి రమేష్, కడలి శంకరం, పేట నాగరాజు, కర్రి రాము, పావులూరి గణపతి, కట్టా గోపాలం పాల్గొన్నారు.

బలహీనవర్గాలకు అన్యాయం చేసిన వైసీపీ

మామిడికుదురు, ఏప్రిల్ 13: బలహీన వర్గాలకు వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని రాజోలు నియోజకవర్గ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ ఆరోపించారు. గోగన్నమఠం, కరవాక, మగటపల్లి గ్రామాల్లో శనివారం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో ప్రచారం నిర్వహించారు. గోగన్నమఠంలో సాగి పాపయ్యరాజు ఇంటి వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బలహీనవర్గాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా సీఎం జగన్ నిర్వీర్యం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో రుద్రరాజు పద్మరాజు, నామన రాంబాబు, ముల్లేటి శ్రీనివాస్, కేతా శ్రీనివాస్, సాగి సత్యనారాయణరాజు, భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, ఈలి శ్రీనివాస్, అనుచూరి పురుషోత్తం, దిరిశాల బాలాజీ, లంకే శ్రీనివాస్, మోకా పార్వతి, బందెల పద్మ, చెల్లుబోయిన హెలీన, చుట్టుగుళ్ల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరం: జనసేనలో చేరిన వైసీపీ ఎంపీటీసీ పల్లి మోసే, పలువురు కార్యకర్తలతో గిడ్డి సత్యనారాయణ

జనసేనలో చేరిన వైసీపీ ఎంపీటీసీ మోసే

పి.గన్నవరం, ఏప్రిల్ 13: గంటిపెదపూడి ఎంపీటీసీ పల్లి మోసే వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. శనివారం పల్లి మోసేకు కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ కండువా వేసి పార్టీ పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే మోసే అనుచరులను స్థానిక నాయకులు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, నాయకులు ఆకుల రామకృష్ణ, సంసాని పెద్దిరాజు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, ఆదిమూలం సూరయ్యకాపు, వరహాలురాజు, కొమ్మల శ్రీను, బొరుసు సుబ్బరాజు, నక్కా సత్యనారాయణ, నేలపూడి దామోదరం, పేరిచర్ల నాగరాజు, తాటికాయల శ్రీనివాసరావు, పల్లి రామ్మూర్తి పాల్గొన్నారు.

సుభాష్ సతీమణి ఎన్నికల ప్రచారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్13: టీడీపీ, జనసేన బీజేపీ కూటమి రామచంద్రపురం నియోజకవర్గ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సతీమణి లక్ష్మీ సునీత శుక్రవారం తన భర్తను ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ పట్టణంలో 19,6వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలు మహిళకు అందజేశారు. తెలుగుమహిళా నాయకులు జాస్తి విజయలక్ష్మీ, బళ్ల లక్ష్మీ, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, కొసనా శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం రాత్రి చోడవరం, తాడిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్యంత్‌రాయ్, టీడీపీ నాయకులు రేవు శ్రీను, చింతపల్లి వీరభద్రరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కొత్తపల్లి శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు అండ



కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభించిన పీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13: కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండ లభిస్తుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ అన్నారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందన్నారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని శనివారం నల్లవంతెన పద్మినీపేట సెంటర్‌లో ఏర్పాటు చేయగా గౌతమ్ ప్రారంభించారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, కేవలం పారిశ్రామికవేత్తలకు మాత్రమే ఆ పార్టీ అండగా నిలుస్తుందని విమర్శించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రూపొందించిన మేనిఫెస్టోను ఇంటింటికీ తిరిగి హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు చీకట్ల అబ్బాయి, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ఏఐసీసీ కోఆప్షన్ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, పీసీసీ ప్రధాన కార్యదర్శులు మాచవరపు శివన్నారాయణ, మహ్మద్ ఆరిఫ్, దామిశెట్టి జయ, వాకపల్లి రాంబాబు, పట్టణ శాఖ అధ్యక్షుడు వంటెద్దు బాబి, షకీలా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అఖండ అన్నసమారాధన

అంతర్వేది, ఏప్రిల్ 13: అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీకనకదుర్గమ్మవారి ఉగాది మహోత్సవాల్లో భాగంగా శనివారం దాతల సహకారంతో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వెయ్యి మందిపైగా అన్నసమారాధనలో పాల్గొన్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ ఆడపడుచులంతా అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. మండలంలో పలు అమ్మవార్ల ఆలయాలవద్ద పూజలు, భజనా కాలక్షేపం నిర్వహించారు.

ఉత్తర రాజగోపురం కలశల పునఃప్రతిష్ఠ పూజలు

అంతర్వేది, ఏప్రిల్ 13: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్తర రాజగోపురంపై కలశ పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమం శనివారం ప్రారంభించారు. తొలుత అర్చకులు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యహవచనం, అంకురార్పణ, దీక్షాధారణ నిర్వహించారు. మూడు రోజులు ఈ పునఃప్రతిష్ఠ పూజలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

పోలీస్‌యాక్టు 30 అమలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు పురస్కరించుకుని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడం, డీజే పెట్టడం చేపట్టరాదని పోలీస్ సెక్షన్-30, 144లు అమలులో ఉన్న కారణంగా ఈనిబంధనలు పాటించాలని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూటమిని చూసి వైసీపీకి ఓటమి భయం



మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు

అల్లవరం, ఏప్రిల్13: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి చూసి వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని అమలాపురం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కోడూరుపాడు టీడీపీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అధ్యక్షతన శనివారం జరిగిన జయహో బీసీసదస్సులో ఆయన మాట్లాడారు. ఓడలరేవు, ఎస్.యానాం బీచ్‌లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆక్వా రైతులను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పెచ్చెట్టి విజయలక్ష్మి, నడింపల్లి సుబ్బరాజు, కడలి వెంకటేశ్వరరావు, ఆకుల లక్ష్మణరావు, చింతా శ్రీను, వేగిరాజు వెంకట్రాజు, నార్గన శ్రీనివాస్, గెద్దాడ శ్రీను, లంకే భీమరాజు, జనసేన నాయకులు కంకిపాటి వీరబాబు, కంకిపాటి గోపి, మోకా బాలయోగి పాల్గొన్నారు.

ఇంటర్‌లో మాచర విద్యార్థునుల ప్రతిభ



మాచర విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమాదేవి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 13: ఇంటర్ ఫలితాల్లో ప్లస్‌టూ జూనియర్ కళాశాల మాచర విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థినులను పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఎంపీసీలో 83శాతం, బైపీసీలో 67శాతం ఉత్తీర్ణత సాధించారని హెచ్‌ఎం చెప్పారు. ఎంపీసీలో దంగేటి వైశాలి 812 మార్కులు, బైపీసీలో మాకా తులసి దుర్గాభవాని 685 మార్కులు, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గాడా ద్రాక్షవల్లి 316మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కారణమైన పీజీటీలు వాడ్రేవు శ్రీనివాస్, ఎన్.వెంకట్, శివశ్రీను, శిరిడిసాయి, ఉదయ్‌లను హెచ్‌ఎం అభినందించారు.

సత్తెమ్మతల్లి ఊరేగింపు

అల్లవరం, ఏప్రిల్ 13: కోడూరుపాడు సత్తెమ్మ తల్లి అమ్మవారి 6వ వార్షికోత్సవం సందర్భంగా కుంకుమ పూజలు, గణపతి హోమాలు ఘనంగా జరిగాయి. కె.ప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు హోమాలు నిర్వహించారు. తీన్‌మార్ వాయిద్యాలు, గరగ నృత్యాలు, మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. కొమరగిరి పట్నంలో సీతారామాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు, పూర్ణాహుతి వేడుకగా జరిగాయి.

సుజాతకు ఉగాది నంది పురస్కారం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 13: రాజమహేంద్రవరంలో ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉగాది నంది అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. శ్రీశ్రీకళావేదిక జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమలాపురం పట్టణానికి చెందిన సాయిసంజీవిని మహిళా వాకర్స్ యోగా సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాతకు సేవా విభాగంలో ఉగాది నంది పురస్కారాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వ నాటక, సంగీత అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మిరెడ్డి చేతులమీదుగా ఈపురస్కారాన్ని అందుకున్నారు. ఈసందర్భంగా సుజాతను పలువురు అభినందించారు.



ఉగాది నంది పురస్కారం అందుకున్న సుజాత

ఉపాధి పనుల్లో సాంకేతిక సమస్యలు తొలగించాలి

మలికిపురం, ఏప్రిల్ 13: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీలకు మస్తరు తీసుకోవడంలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధి కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. నేషనల్ మోనటరింగ్ మొబైల్ సిస్టమ్ అమలు వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. సాంకేతిక సమస్య వచ్చినప్పుడు మాన్యువల్ సిస్టమ్‌లో ఎడిట్ ఆన్సర్ ఇస్తే కూలీలు నష్టపోయే అవకాశం ఉండదన్నారు. సర్వరు సామర్థ్యాన్ని పెంచాలని ఆయన కోరారు.

ఆలమూరులో ప్రజాగళం



ఆలమూరులో ప్రజాగళంలో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ యువనేత సంజీవ్

ఆలమూరు, ఏప్రిల్ 13: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆలమూరులో శనివారం ప్రజాగళం నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ టీడీపీ యువనేత బండారు సంజీవ్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం సాగింది. కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వ హామీలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

రేపటి నుంచి వేట విరామం

అంతర్వేది, ఏప్రిల్ 13: తీరం ప్రాంతంలో వేట చేసుకునే మత్స్యకారులకు సోమవారం నుంచి వేట నిషేధం అమలవుతుందని ఎఫ్‌డీవో రమణ తెలిపారు. 45రోజుల పాటు వేట నిషేధం జరుగుతుందని,మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: శ్రీరంగనీతులు
వెంకటరమణ	: బడేమియా చోటేమియా
శ్రీలలిత	: లవ్‌గురు
శేఖర్ స్క్రీన్-1	: గీతాంజలి మళ్లీ వచ్చింది
శేఖర్ స్క్రీన్-2	: మంజుమ్మల్ బాయ్స్
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: ఓంభీమ్‌బుష్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఫ్యామిలీ స్టార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్

నేడు కోనసీమ జిల్లా అరసం మహాసభ

అమలాపురం రూరల్, ఏప్రిల్ 13: ఏపీ అభ్యుదయ రచయితల సంఘం జిల్లాశాఖ ప్రథమ మహాసభ బండారులంక వీఎస్ఎం షాపింగ్ మాల్ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10గంటలకు జరుగుతుందని కన్వీనర్ గండి స్వామిప్రసాద్ తెలిపారు. జిల్లాశాఖ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అధ్యక్షతన జరిగే ప్రథమ మహాసభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరయ స్వామి తదితర ప్రముఖులు హాజరవుతారు. మహాసభ అనంతరం జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుని ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం



అంబాజీపేట, ఏప్రిల్ 13: పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. చాలా ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన స్తంభాన్ని శుక్రవారం రాత్రి లారీ ఢీకొనడంతో పక్కకు ఒరిగింది. దీంతో విద్యుత్ శాఖ సిబ్బంది తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ స్తంభాన్ని వెదురునిచ్చెనతో బోటు పెట్టడం కొసమెరుపు.